## ఆదివాసీలను అడ్డగించిన పోలీసులు

### ఐటీడీఏ కార్యాలయం ముందు ఆందోళన



**టీ.మీడియా,జూలై20. చింతూరు:**రంపచోడవరం లో నిర్వహించే ఆదివాసి మహా గర్జన సభకు చింతూరు డివిజన్ నుండి వాహనాల్లో తరలి వెళ్తున్న ఆదివాసీలను సోమవారం పోలీసులు అడ్డగించినారు. సభకు వెళ్ళనీయకుండా అడ్డుపడటంతో ఆదివాసీలు ఐటిడిఏ కార్యాలయం ముందు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. పోలీసుల జులం నశించాలని. శాంతియుత సభకు ఆటంకం కలిగించిన అధికారుల తీరుపై ఆదివాసీలు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల హక్కులను కాలరాస్తుందని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పై పలువురు తీవ్ర అభ్యంతరం తెలిపినారు. సుమారు గంట సేపు రాస్తారోకో నిర్వహించడంతో రహదారిపై వందల సంఖ్యలో వాహనాలు స్తంభించినాయి.

ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా నాయకులు సేసం సురేష్, పులి

3లో

Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 200
సంచిక : 308
పేజీలు : 4

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

మంగళవారం, జులై 21, 2026

# ఎల్‌నినోను ఎదుర్కోవాలి

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**టి మీడియా, జులై 20, ఖమ్మం:**

**ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను శాస్త్రీయ అంచనాలు, క్షేత్రస్థాయి వాస్తవాలు, శాఖల సమన్వయంతోనే సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, ., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్,ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు లతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులు, వర్ష పాతం, త్రాగునీటి లభ్యత, సాగునీటి పరిస్థితి, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరా, పంటల ప్రణాళికలపై సంబంధిత శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు.**




సమావేశంలో పెద్దపల్లి జిల్లాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ ఎల్‌నినో పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూలి భూగర్భ జలాలు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రాబోయే రెండు నెలల్లో మరింత తగ్గిపోతాయని, రైతులు ఎవరు వరి పంట సాగు చేయవద్దని ఆయన కోరారు. వాస్తవ పరిస్థితులను దాచకుండా అధికారులు నేరుగా రైతులతో మాట్లాడాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో త్రాగునీటి అవసరాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కడైనా త్రాగునీటి వనరులు సరిపోని పరిస్థితి ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ వనరులను గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రాబోయే ఒక సంవత్సరం త్రాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు.

.రైతు వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రతి గ్రామంలో రైతులతో సమావేశాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. అధికారులు మౌనంగా ఉండకుండా వాస్తవ పరిస్థితులను రైతులకు స్పష్టంగా తెలియ జేయాలని, సమాచార ప్రసారంలో సమర్థవంతమైన విధానాన్ని అవలంబించాలని సూచించారు. నీటి లభ్యత లేని పరిస్థితుల్లో వరి సాగు చేస్తే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఏమీ చేయలేదనే పరిస్థితి రాకుండా ముందుగానే స్పష్టమైన అవగాహన కల్పించాలని అన్నారు. నీటి లభ్యత లేని పరిస్థితుల్లో వరి సాగు చేస్తే అది పూర్తిగా రైతుల సొంత బాధ్యతేనని స్పష్టమైన సందేశం క్షేత్రస్థాయిలో చేరాలని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాధ్యమైనన్ని ప్రాంతాల్లో గోదావరి బ్యాక్‌వాటర్‌ను ఎత్తిపోసి చెరువులను నింపేందుకు అవసరమైన మోటార్లు, విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేసి ఇంజినీర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రస్తుతం గోదావరి నీటిని వినియోగించి చెరువులను నింపగలిగితే వచ్చే వేసవి వరకు త్రాగునీటి అవసరాలను తీర్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఖరీఫ్‌లో సాగునీటికి నీరు అందుబాటులో లేని పరిస్థితుల్లో రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లా అవసరాలకు ఎలా వినియోగించాలనే అంశంపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ప్రస్తుతం వైరా, లంకా సాగర్ జలాశయాలను త్రాగునీటి అవసరాల కోసమే నింపుతున్నా మని, పాలేరు

3లో



# వాన కోసం రైతు ఆర్తనాదం..!

- కాలం దాటినా కరుణించని వరుణుడు
- ఎండిపోతున్న పంటలు.. • పెరుగుతున్న రైతన్న ఆందోళన

**టీ మీడియా,జూలై 20, సింగరేణి(కారేపల్లి):**సింగరేణి మండలంలో వర్షాభావ పరిస్థితులు రోజురోజుకూ తీవ్రమవుతుండటంతో రైతుల గుండెల్లో ఆందోళన మరింత పెరుగుతోంది.ఈ సమయానికి కురవాల్సిన వర్షాలు లేకపోవడంతో ఇప్పటికే విత్తనాలు చల్లిన పొలాల్లో మొలకలు ఎండిపోతుండగా,ఇంకా విత్తనాలు వేయని రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.కాలం దాటిపోతున్నా వరుణుడు కరుణించకపోవడంతో ఖరీఫ్ సాగు పూర్తిగా సందిగ్ధంలో పడింది.ఒకటి,రెండు ప్రాంతాల్లో స్వల్ప జల్లులు పడినా ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడంతో చెరువులు,కుంటలు,వాగులు వెలవెలబోతున్నాయి.భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంతో బోర్లలో కూడా నీటి లభ్యత తగ్గిపోయింది.దీంతో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.పత్తి, మిర్చి, వరి,మొక్కజొన్న తదితర పంటల సాగు ఆలస్యమవుతుండగా,ఇప్పటికే విత్తిన పంటలు నీరులేక ఎండుముఖం పడుతున్నాయి.విత్తనాలు, ఎరువులు,పురుగుమందులు కొనుగోలు చేయడానికి,కూలీల ఖర్చుల కోసం అప్పులు చేసి వ్యవసాయం ప్రారంభించిన రైతులు ఇప్పుడు పెట్టుబడి కూడా తిరిగి వస్తుందో లేదోనని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పొలాలకు వెళ్లిన ప్రతిసారీ ఒకసారి ఆకాశాన్ని,మరోసారి ఎండిపోతున్న పంటలను చూస్తూ కన్నీటి పర్యంతమవుతున్నారు.వ్యవసాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం మరో కొద్ది రోజులు కూడా వర్షాలు కురవకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.సాగు విస్తీర్ణం తగ్గడమే కాకుండా రైతులు భారీ ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.ప్రస్తుత పరిస్థితిని ప్రభుత్వం అత్యవసరంగా సమీక్షించి,సింగరేణి మండలాన్ని వర్షాభావ ప్రభావిత ప్రాంతంగా గుర్తించి రైతులకు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.అవసరమైన చోట ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం,పంట బీమా,ఇన్‌పుట్ సబ్సిడీ,సాగునీటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు,రైతులకు ఆర్థిక సహాయం వంటి చర్యలను వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు."దేశానికి అన్నం పెట్టే రైతు నేడు ఒక్క వాన చినుకు కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నాడు.ప్రకృతి కరుణించి సకాలంలో వర్షాలు కురిస్తేనే రైతు బతుకుతాడు.రైతు బతికితేనే వ్యవసాయం బతుకుతుంది.వ్యవసాయం బతికితేనే దేశానికి అన్నం దొరుకుతుంది" అంటూ సింగరేణి మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం మండలంలోని రైతన్న కళ్లన్నీ మేఘాలపైనే నిలిచిపోయాయి.

# 'ఆరోగ్య సేవల్లో తీవ్ర నిర్లక్ష్యం..

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి'

### బీఆర్ఎస్ కార్పొరేటర్ సింధు తపస్వి వినతి

**టీ మీడియా ,జూలై 20 ,పాల్వంచ :**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గర్భిణీల మరణాలు, నవజాత శిశువుల మరణాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య నిర్లక్ష్యం, అంబులెన్స్ సేవల వైఫల్యం, మాతా-శిశు ఆరోగ్య సేవల్లో తీవ్రమైన లోపాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ 7వ డివిజన్ కార్పొరేటర్ సింధు తపస్వి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా అత్యవసర వైద్య సేవలను బలోపేతం చేయాలని, ప్రాణాలను కాపాడాల్సిన ప్రభుత్వ ఆస్పత్రులు, నిర్లక్ష్యంతో ప్రాణాలను కోల్పోయే కేంద్రాలుగా మారడం అత్యంత బాధాకరం అన్నారు. ఒకే జిల్లాలో వరుసగా ఇలాంటి ఘటనలు జరగడం అనేది యాదృచ్ఛికం కాదనీ, ఇది వ్యవస్థాపరమైన వైఫల్యానికి, బాధ్యతారాహిత్యానికి, పరిపాలనా నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనం అని ఆమె పేర్కొన్నారు**

**జిల్లాలో ఇటీవల జరిగిన ప్రధాన ఘటనలు**

పురిటి నొప్పులతో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లిన చాట్ల వనజకు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్ నర్సు ప్రసవం నిర్వహించింది. ఆడ శిశువు మృతిగా జన్మించగా, తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న వనజను ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమె మరణించింది. అనంతరం అంత్యక్రియల సమయంలో శస్త్ర చికిత్సలో ఉపయోగించే కత్తెర చితాభస్మంలో బయటపడటం వైద్య వ్యవస్థను తీవ్రంగా ప్రశ్నించే ఘటన.



దీనిపై వైద్యాధికారిని సస్పెండ్

2లో



## నకిలీ పెండ్లి రిజిస్ట్రేషన్ పత్రాలపై రెవెన్యూ శాఖ విచారణ

**టీ మీడియా ,జూలై 20 , చంద్రుగొండ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండల కేంద్రంలో నకిలీ పెళ్లి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పై రెవెన్యూ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. చంద్రుగొండ గ్రామ పంచాయతీ పరిధిలో గల అయ్యన్నపాలెం గ్రామంలో 2018లో వివాహం జరిగిన ఓ జంట 2025లో వివాహం జరిగినట్లు ఆధారాలు, నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి కల్యాణ లక్ష్మి పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం ఆడ, మగ కలరు. కల్యాణలక్ష్మి పథకం వచ్చేలా ఓ ప్రజాప్రతినిధి భర్త (ఉపాధ్యాయుడు), నెట్ సెంటర్ నిర్వహికుడు కలిసి ఆ జంటకు తాము కల్యాణ లక్ష్మి చెక్కు ఇప్పిస్తామని తమకు కొంత డబ్బు ఇవ్వాలని బేరాలు కుదుర్చుకుని, రూ.40 వేలు ఆ జంట దగ్గర నుండి నగదు రూపేనా తీసుకున్నట్లు అధికారుల ఎదుట ఒప్పుకున్నట్లు విశ్వసనీయ సమాచారం గతంలో సైతం ఇలా నకిలీ పత్రాలు పెట్టి కల్యాణ లక్ష్మి పథకం చెక్కులు తీసుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి అధికార పార్టీ ప్రజా ప్రతినిధి భర్త పూర్తిగా సహాయ, సహకారాలు అందించడం విశేషం. బదిలీపై వెళ్లిన గ్రామ పంచాయతీ సెక్రటరీ సంతకం, ఇతర అధికారుల సంతకాలు, నకిలీ స్టాంపులు సృష్టించి ఫోర్జరీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీనిపై చంద్రుగొండ తాసీల్దార్ జగదీశ్వర ప్రసాద్ ను వివరణ కోరగా ఇప్పటికే రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహిస్తున్నారని, పూర్తి విషయాలు త్వరలో బహిర్గతం చేస్తామన్నారు. తప్పు చేస్తే ఎవరిని వదిలిపెట్టం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## భార్య టార్చెర్ కు బలైన భర్త




**టీ మీడియా ,జూలై 20 , రఘునాథపాలెం :** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో గుండెలను పిండేసే అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. భార్య వేధింపులు మరియు మానసిక అవమానాలు తట్టుకోలేక ఒక నవవరహుడు పెళ్లయిన మూడు నెలలకే తన ప్రాణాలను తీసుకున్నాడు. రాంక్యాతండా గ్రామానికి చెందిన బాణోత్ సదర్‌లాల్ (27) అనే యువకుడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర తీవ్ర కలకలాన్ని, విషాదాన్ని నింపింది.

**నిందలు, అవమానాలతో నరకం**

కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సదర్‌లాల్‌కి మూడు నెలల క్రితమే వివాహమైంది. అయితే పెళ్లయిన కొద్దిరోజులకే దంపతుల మధ్య మనస్పర్థలు ప్రారంభమయ్యాయి. భార్య తనను 'మగతనం లేదంటూ' నిత్యం వేధింపులకు గురిచేసేదని కుటుంబీకులు తెలిపారు. ఇటీవల సీత్లా పండుగ సందర్భంగా సదర్‌లాల్ తన అత్తారింటికి వెళ్లాడు. అక్కడ కూడా భార్య తన కుటుంబసభ్యులతో కలిసి అందరిముందే అతనిపై అనుచిత ఆరోపణలు చేస్తూ తీవ్రంగా అవమానించింది. అత్తారింట్లో జరిగిన అవమానంతో తీవ్ర మానసిక వేదనకు గురైన సదర్‌లాల్.. ఇంటికి తిరిగివచ్చే క్రమంలో తన బావకు ఫోన్ చేసి 'నేను ఇక బతకలేను, చనిపోతున్నాను' అని చెప్పి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

## అక్రమ వడ్డీ, లైసెన్స్ లేని చిట్టీల నిర్వాహకులపై కేసులు

**టీ మీడియా ,జూలై 20 ,మహబూబాబాద్:** మహబూబాబాద్ సబ్‌డివిజన్ లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక తనిఖీలు (రైడ్స్) నిర్వహించబడ్డాయి. ఈ ప్రత్యేక తనిఖీలలో సీఐలు, ఎస్ఐలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, అక్రమంగా అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ, రుణగ్రహీతల నుంచి షఉరిటీల పేరుతో ఖాళీ చెక్కులు, భూములకు సంబంధించిన అసలు పత్రాలు, ఇతర విలువైన డాక్యుమెంట్లు అక్రమంగా స్వాధీనం చేసుకోవడంతో పాటు, ఎటువంటి అనుమతులు (లైసెన్స్) లేకుండా చిట్టీలు నిర్వహిస్తూ ప్రజలను ఆర్థికంగా వేధిస్తున్న వ్యక్తులపై సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 90 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించగా, 10 మంది నిందితులపై 10 కేసులు నమోదు నమోదు చేయటం జరిగింది.



అదేవిధంగా, వారి వద్ద నుండి సుమారు రూ.3.59 కోట్ల విలువైన 266 డాక్యుమెంట్లను స్వాధీనం (సీజ్) చేసుకున్నాము. అక్రమ వడ్డీ వ్యాపారం, అనుమతి లేని చిట్టీల నిర్వహణ, ప్రజలను బెదిరించి ఖాళీ చెక్కులు, ఆస్తి పత్రాలు తీసుకోవడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై జిల్లా పోలీస్ శాఖ నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు కొనసాగిస్తుందని జిల్లా పోలీస్ శాఖ హెచ్చరించింది. ప్రజలు ఎవరైనా ఇలాంటి అక్రమ వడ్డీ వ్యాపారులు లేదా లైసెన్స్ లేని చిట్టీల నిర్వాహకుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే, వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా జిల్లా పోలీస్ అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని తెలియజేస్తున్నాము.

# ఎన్నికల హామీలను అమలు పరచడంలో ప్రభుత్వాలు విఫలం

**బి విజయ సారథి సిపిఐ జిల్లా కార్యదర్శి.**

**టీమిడియా,జులై20, కురవి:**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి విమర్శించారు

కురవి మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో బి విజయసారథి మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా ఏటా కోటి ఉద్యోగాలు, వంద రోజులలో నిత్యవసర వస్తువుల ధరలు తగ్గింపు, నల్లధనం వెలికితీత, పేదరిక తగ్గింపు, లాంటి మాటలు కోటలు దాటాయి తప్ప ఆచరణలో ప్రజలకు మొండి చేయి చూపిన మోదీ ప్రభుత్వం, లక్షలాది పిల్లల భవితవ్యం నిర్దేశించే నీట్ లాంటి పరీక్ష పేపర్లు లీక్ కావడం ఈ ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని తీవ్రంగా విమర్శించారు




పేదలకు ఇళ్ల స్థలాలు, ఇల్లు, చేయూత పెన్షన్లు యువతకు ఉద్యోగాల కల్పన, రైతాంగానికి సాగునీరు అందించడంలో విఫలం కావడమే కాకుండా, వైద్య,విద్యారంగంపై స్పష్టమైన విధానాలు లేకపోవడం రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలకు నిదర్శమని, ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలకు ఇచ్చిన స్పష్టమైన హామీలను అమలు పరచాలని డిమాండ్ చేశారు

ప్రభుత్వ వైఫల్యాలను ఎండ కట్టడానికి ఆగస్టు 6 నుంచి 14 వరకు మండల కేంద్రాలలో పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఐ సీనియర్ నాయకులు అప్పాల వెంకన్న కుమారుడు అప్పాల రాజేందర్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతినిలి తెలియజేశారు

ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి, బుర్ర సమ్మయ్య, దూదికట్ల సారయ్య, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, నిలుగొండ నాగేశ్వరరావు, బాచి తదితరులు పాల్గొన్నారు

# ఐటీడీఏ శిక్షణ ఏర్పాట్లపై ఎమ్మెల్యే జారె ఆకస్మిక తనిఖీ

**టీ మీడియా, జూలై 20,దమ్మపేట :**

అశ్వారావుపేట నియోజకవర్గంలో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. సోమవారం ఆయన అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా స్థానిక గిరిజన భవన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకుల కోసం నిర్వహించనున్న ఉచిత ఉపాధి, ఉద్యోగ శిక్షణా కార్యక్రమాల ఏర్పాట్లను ఆకస్మికంగా పరిశీలించారు. శిక్షణ పొందే యువతకు నాణ్యమైన సదుపాయాలు కల్పించడంతో పాటు, శిక్షణ అనంతరం మెరుగైన ఉపాధి అవకాశాలు లభించేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం అశ్వారావుపేట క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన షెడ్యూల్డ్ కాస్ట్ (ఎస్‌సీ) జిల్లా, మండల కమిటీ సభ్యుల సమావేశంలో పాల్గొన్నారు. కమిటీని మరింత బలోపేతం చేయడం, దళిత వర్గాల సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సభ్యులతో సుదీర్ఘంగా చర్చించారు. తదుపరి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, పనులను మరింత వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇదే సందర్భంగా ప్రమాదానికి గురైన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పసుపులేటి రామస్వామిని ఆయన నివాసంలో పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపాలిటీ



వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఎస్‌సీ జిల్లా అధ్యక్షుడు గద్దల రమేష్, జూపల్లి ప్రమోద్, అప్పారావు, కౌన్సిలర్ మిండా హరిబాబు, కోలా లక్ష్మీనారాయణ, అల్లాడి రామారావు, రమేష్, సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

**-ఆరు నుంచి సిపిఐ పాదయాత్రలు**
**-నగర కమిటీ సమావేశంలో దండి సురేష్**

**టి మీడియా, జులై20, ఖమ్మం :** ప్రజా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి -తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం ఆందోళన చేపట్టక తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ స్పష్టం చేశారు. ప్రజా పోరాటాలకు ప్రజలను సన్నద్ధం చేయాలన్నారు. సిపిఐ నగర కమిటీ సమావేశం సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. వరదా నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన, పేదలకు నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడంలో కొంత వివక్ష -నెలకొన్నదన్నారు. రెండు దశాబ్దాలుగా పట్టణీకరణ అత్యంత వేగంగా జరిగిందని అందుకు అనుగుణంగా మౌలిక -వసతుల కల్పన జరగడం లేదన్నారు. పట్టణాల్లో నివసిస్తున్న పేదలు సరైన ఉపాధి అవకాశాలు లేక నివాస స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పట్టణ పేదలను సమీకరించి సమస్యల పరిష్కారానికి సిపిఐ కృషి చేస్తుందని -ఆయన తెలిపారు. గత ప్రభుత్వం బిపిఎల్ ద్వారా నివాస స్థలాలను ఇచ్చేందుకు నిరాకరించి ఆ జీవోను సైతం రద్దు చేసిందని పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ రెండున్నర ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఆ -పని చేయలేదని సురేష్




తెలిపారు. సంక్షేమ పథకాల అమలు కూడా సరైన రీతిలో జరగడం లేదని పింఛన్ల పెంపుతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నగర కార్యదర్శి ఎస్కే జానిమియా, రాష్ట్ర సమితి సభ్యులు -మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు తాటి నిర్మల, పాల్గొన్నారు.

## 'ఆరోగ్య సేవల్లో తీవ్ర నిర్లక్ష్యం..

చేసినప్పటికీ, ఒక తల్లి ప్రాణాన్ని, ఒక పసికందు ప్రాణాన్ని తిరిగి తీసుకురా రాలేరని, అదేవిధంగాఅమరారం గ్రామానికి చెందిన కలివేటి సంధ్యకు ప్రసవ నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా సమయానికి రాలేదు. కుటుంబ సభ్యులు ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు లేకపోవడంతో మరో ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యంలో ఆటోలోనే ప్రసవం జరిగింది. అనంతరం ఆమె మరణించింది. సకాలంలో అంబులెన్స్, వైద్యులు అందుబాటులో ఉంటే ఈ ప్రాణం నిలిచేదన్నారు.

దమ్మపేట మండలం జగ్గారం గ్రామానికి చెందిన గర్భిణి భవానికి ఆస్పత్రిలో తగిన వైద్య సహాయం అందక, బెడ్ పక్కనే నిల్చుని ఉండగానే శిశువు కిందపడే పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన ప్రజలను తీవ్రంగా కలిచివేసింది. మాతా-శిశు ఆరోగ్య కేంద్రంలోనే ఇలాంటి దారుణ పరిస్థితులు ఉండడం అత్యంత ఆందోళనకర మైన విషయమన్నారు. ఈ మూడు ఘటనలు వేర్వేరు సంఘటనలు కావనీ ఒకే సమస్యకు మూడు భయానక రూపాలనీ ముఖ్యంగా గుండాల, పినపాక వంటి మారుమూల ప్రాంతాల్లో వైద్యులు లేకపోవడం, స్టాఫ్ నర్సుల కొరత, 108 అంబులెన్స్ ఆలస్యం, అత్యవసర వైద్య పరికరాల లేమి, ప్రసూతి నిపుణుల కొరత, జిల్లా కేంద్రంలోని వీజిఎ ఆస్పత్రిలో కూడా పర్యవేక్షణ లోపించడం వంటి కారణాల వల్ల అమాయక గర్భిణీలు, నవజాత శిశువులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన అన్ని మాతా-శిశు మరణాలపై హై లెవల్ స్వతంత్ర విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని, నిర్లక్ష్యం చేసిన వైద్యులు, సిబ్బంది, సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గుండాల, పినపాక, అశ్వారావుపేట, దమ్మపేట, చర్ల, మణుగూరు వంటి మారుమూల ప్రాంతాల్లో 24ఐ7 వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వైద్యులను నియమించాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి నిపుణులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, అవసరమైన మందులు, అత్యవసర పరికరాలు అందుబాటులో ఉంచాలని, 108 అంబులెన్స్ సేవలను బలోపేతం చేసి, స్పందన సమయంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలనీ రామవరం వీజిఎ ఆస్పత్రిపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించి, అవసరమైన వైద్యులు, సిబ్బంది, పరికరాలను తక్షణమే ఏర్పాటు చేయాలని, ప్రతి గర్భిణిని తప్పనిసరిగా ట్రాక్ చేసే జిల్లా స్థాయి ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని బాధిత కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయం, కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పనతో పాటు పూర్తి న్యాయం చేయాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా వ్యాప్తంగా ప్రతి ఆస్పత్రిలో జవాబుదారీతనం అమలు చేయాలని ఆమె అధికారులను డిమాండ్ చేశారు.

## మీ ప్రాణ భద్రతే మా మొదటి ప్రాధాన్యం

**-నిబంధనలు పాటించండీ**

**- ఏ ఎస్ పి బొడ్డు హేమంత్ .**



**టీ.మీడియా,జూలై20,చింతూరు:**ప్రజల ప్రాణ భద్రతే తమ మొదటి ప్రాధాన్యమని, నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణం చేయాలని చింతూరు ఏ ఎస్ పి బొడ్డు హేమంత్ పేర్కొన్నారు.
గిరిజనసభను తాము అడ్డుకోవడం అడ్డుకోవడం కాదని .. ప్రమాదాలు నివారించడానికే సోమవారం తనిఖీలు చేపట్టామన్నారు. చింతూరు ఐటిడిఎ ముందు ఆదివాసీలు ధర్నా ఘటన పై చింతూరు ఎ ఎస్పీ బొడ్డు హేమంత్ మాట్లాడుతూ, రంపచోడవరం మహాసభకు వెళ్తున్న వారిని ఉద్దేశించి తనిఖీలు చేయలేదని స్పష్టం చేశారు. ఇది సాధారణంగా నిర్వహించే రోడ్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమంలో భాగమేనని తెలిపారు.ఈ సందర్భంగా సుమారు 10 కమర్షియల్ గూడ్స్ వాహనాలను తనిఖీ చేశామని, వాటిలో కొన్ని వాహనాల్లో 20 నుంచి 50 మంది వరకు ప్రయాణిస్తున్నట్లు గుర్తించి నిలిపివేసినట్లు చెప్పారు. ఘాట్ రోడ్లలో ఇలాంటి ప్రయాణాలు చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు.మూడు వారాల క్రితం కాకినాడ నుంచి భద్రాచలం వెళ్తున్న బొలెరో పికప్‌లో 26 మంది ప్రయాణిస్తుండగా ఘాట్ రోడ్డులో జరిగిన ప్రమాదాన్ని గుర్తు చేస్తూ, అలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టామని వివరించారు.ప్రజలు సభలకు, సమావేశాలకు వెళ్లడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే గూడ్స్ వాహనాల్లో ప్రయాణించవద్దని, ప్రయాణికుల వాహనాల్లో కూడా సామర్థ్యానికి మించి ఎక్కవద్దని సూచించారు.



## విద్యార్థులపై పోలీసుల దాడి దురదృష్టకరం

**ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**

**టి మీడియా, జులై 20,ఖమ్మం:** నీట్ పేపర్ లీకేజీపై దేశ వ్యాప్తంగా విద్యార్థి, యువజనులు చేపట్టిన ఉద్యమం లో భాగంగా సోమవారం ఢిల్లీలో మార్చ్ టు పార్లమెంట్ ను శాంతియుతంగా నిర్వహిస్తున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీ చార్జ్ చేయడాన్ని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా.. ఢిల్లీలో ఉన్న ఆయన ఈ విషయం తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థులు తమ సమస్యలను శాంతియుతంగా వ్యక్తం చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని, అలాంటి వారిపై లాఠీచార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం.. అత్యంత అమానవీయ, కౄరమైన చర్య అని, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ వైఫల్యం అని, విద్యార్థుల గొంతుకను అణిచివేసే విధానాలు సమర్థనీయం కావని స్పష్టం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై నమోదైన కేసులనుఉపసంహరించుకోవడంతో పాటు గాయపడిన వారికి తక్షణ మెరుగైన వైద్య సహాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

# వినతులను త్వరితగతిన పరిష్కరించాలి.

**-అదనపు కలెక్టర్ వేణుగోపాల్**



**టి మీడియా, జులై 20, పాల్వంచ:**జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ప్రజల నుండి అందిన వినతులు, ఫిర్యాదులను జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, జిల్లా గృహనిర్మాణ సంస్థ (హౌసింగ్) ప్రాజెక్టు డైరెక్టర్‌తో కలిసి స్వీకరించి పరిశీలించారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి వినతిని సకాలంలో పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయంతో పనిచేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే వినతులను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించి దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని సూచించారు.
స్వీకరించిన కొన్ని వినతులు
కొత్తగూడెంకు చెందిన గుగులోతు కృష్ణకుమారి తన తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం కోసం రెండు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు మంజూరు కాలేదని విన్నవించారు. ఈ దరఖాస్తును పరిశీలించిన అదనపు కలెక్టర్ తదుపరి చర్యల కోసం కొత్తగూడెం ఆర్డీవోకు ఎండార్స్ చేశారు.సారపాక గాంధీనగర్ గ్రామపంచాయతీకి చెందిన తన్నీరు నాగదేవి ధరణి సర్వే సమయంలో తన ఇంటి పన్ను అంచనా విలువ పొరపాటున సున్నా గా నమోదైందని, దీంతో ఇంటి పన్ను విధించడం లేదని తెలిపారు. ఇంటి పన్ను రసీదు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు తదితర సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇంటి పన్ను అంచనాను సరిచేసి పన్ను చెల్లించే అవకాశం కల్పించాలని కోరారు. ఈ వినతిపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారికి ఎండార్స్ చేశారు.
ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల కోసంఉచిత కంటి వైద్య శిబిరం



**టీ మీడియా ,జూలై 20 ,కూసుమంచి:**మానవతా దృక్పథంతో,పేద ప్రజలకు అండగా నిలుస్తూ, సొంత ఖర్చుతో ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఓ హిందూ భావజాల వాది ముందుకు కదిలారు. సామాజిక సేవ కార్యక్రమాలో భాగంగా ఆదివారం మండల కేంద్రం కూసుమంచిలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం జరుగునుంది. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వాహకులైన, ఉన్నత విద్యావంతుడు, భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు, మండల కేంద్రం కూసుమంచి గ్రామపంచాయతీ పాలకమండలి 8 వ, వార్డు సభ్యులు గుండా ఉపేందర్ రెడ్డి సోమవారం " టీ మీడియా" తో మాట్లాడారు. ఆది నుంచి నిరక్షరాసులైన, పేద ప్రజలు సంక్షేమం, అభ్యున్నతి తో పాటు అన్ని రకాల వెనుకబడి ఉన్నారంటూ తొలుత ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక కర్షక శ్రామిక వర్గ ప్రజా సమస్యల సాధన కోసం రాజకీయంగా రాజీలేని నిరంతర పోరాటం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. తన శక్తిమేర, వంతుగా మండల కేంద్రం కూసుమంచి ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో నైపుణ్యులైన వైద్యులచే కంటి పరీక్షలు నిర్వహించి, ఉచిత మందుల పంపిణీ, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామని ఆయన అన్నారు. తాను నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరం ద్వారా మండలంలోని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు సోమవారం ఏ సి పి తిరుపతిరెడ్డి నీ మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమం కి ముఖ్యఅతిథిగా ఆహ్వానించినట్లు, అందుకు ఏ సీ పి సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా ఎ సి పి కి మొక్కని అందించానని ఉచిత మెగా కంటి వైద్య నిర్వాహకులు గుండా ఉపేందర్ రెడ్డి తెలిపారు

## దళిత--గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను**

**వెంటనే విడుదల చేయాలి**

**కొండబోయిన నాగేశ్వరరావు**



**టీ మీడియా,జూలై20,సింగరేణి(కారేపల్లి):**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సింగరేణి మండలంలోని దళిత,గిరిజన ఆవాస ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలో పలు కీలక సమస్యలు వెలుగులోకి వచ్చాయని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు తెలిపారు.సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ,గ్రామాల్లో తాగునీరు,రహదారులు,డ్రైనేజీ,విద్యుత్,గృహాలు,విద్య,వైద్యం వంటి మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందన్నారు.భూమిలేని వ్యవసాయ కార్మికులు ఉపాధి హామీ చట్టంలో జరుగుతున్న మార్పుల వల్ల జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.దళిత,గిరిజన ఆవాస ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని,ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం కేటాయించిన నిధులను ఎలాంటి ఆలస్యం లేకుండా విడుదల చేసి,వాటిని పూర్తిగా దళిత,గిరిజన ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని డిమాండ్ చేశారు.ఎస్సీ,ఎస్టీల సామాజిక,ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసే లక్ష్యంతో జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు.అంతోదయ అన్నపూర్ణ కార్డుల లబ్ధిదారుల్లో అత్యధికులు దళిత,గిరిజన పేద కుటుంబాలేనని,35 కిలోల బియ్యం అందించే ఈ కార్డులను రద్దు చేసే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసిన లబ్ధిదారులకు ఇప్పటికీ చివరి బిల్లులు విడుదల కాలేదని విమర్శించారు.అలాగే, కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఇవ్వాల్సిన రూ.60 వేల వాటాను వెంటనే విడుదల చేయాలని,దళిత,గిరిజనులకు రూ.6 లక్షల ఇళ్ల సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. రెండో విడతలో అర్హులైన ప్రతి కుటుంబానికి రాజకీయ పక్షపాతం లేకుండా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.విద్య, వైద్యం, గృహాలు,ఇళ్ల స్థలాలు,పోడు హక్కులు,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సర్వే ద్వారా గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, నిరుపేద దళిత,గిరిజన కుటుంబాలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని నాగేశ్వరరావు కోరారు.

## ఎల్‌నినోను ఎదుర్కోవాలి

జలాశయంలో కూడా సెప్టెంబర్-2026 వరకు మాత్రమే తాగునీటి నిల్వలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి నీటిని పాలేరు జలాశయానికి తరలించే అవకాశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను అవకాశంగా మలుచుకొని ఆయిల్‌పామ్ సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే ఆయిల్ పామ్, పప్పుధాన్యాలు, చిరు ధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి రాబోయే మూడు నెలల పరిస్థితులకే పరిమితం కాకుండా కనీసం ఒక సంవత్సరం కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు.ప్రతి మండలానికి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ప్రతి రైతుకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాతావరణ, వ్యవసాయ, నీటిపారుదల, భూగర్భ జలాల, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో స్థానిక సమాచారాన్ని విశ్లేషించి మండల స్థాయి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ఎల్ నినో సూపర్ స్థితిలో తీసుకునే చర్యలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, సుడా చైర్‌పర్సన్ దుర్గా ప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌వో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఉమ్మడి ఖమ్మం జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, పాల్గొన్నారు.

## ఆదివాసీలను అడ్డగించిన పోలీసులు

సంతోష్ మీడియాతో మాట్లాడుతూ తమ ఆదివాసి హక్కులకై శాంతియుత సభను నిర్వహించేందుకు రంపచోడవరం వెళుతున్న వాహనాలను అడ్డుకోవడం అన్యాయమని ఆదివాసీల సభను జరగకుండా ప్రభుత్వం అధికారులను ఆదివాసీలపై ఉసిగొల్పటం దుర్మార్గమైన చర్య అని అన్నారు. తక్షణమే ఐటీడీఏ పీవో స్పందించి ప్రజా సమక్షంలో మహాసభకు అనుమతి ఇప్పించాలని డిమాండ్ చేశారు.
అనంతరం ఏ ఎస్ పి బొడ్డు హేమంత్ కుమార్, ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ ఆదివాసి సంఘ నాయకులతో చర్చలు జరిపి మహాసభకు రంపచోడవరం ఆదివాసీలు వెళ్లేందుకు అనుమతులను ఇప్పించారు . దాంతో వాహనాల్లో ఉన్న ఆదివాసి నాయకులు ప్రజలు రంపచోడవరం మహాసభకు బయలుదేరారు.
ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘం జిల్లా నాయకులు ప్రజానీకం పాల్గొన్నారు.